## సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



కొడంగల్, జనవరి 31: మండలంలోని రుద్రారం గ్రామంలో సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ శుక్రవారం స్థల పరిశీలన చేశారు. గ్రామంలోని 151 సర్వే నంబర్ భూమిని పరిశీలించి సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉంటుందా లేదా అని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ, ఏపీఎం, సర్వేయర్‌తో పాటు ఏఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

## ■ ఉద్యోగ విరమణ సన్మానం..



యాలాల/బషీరాబాద్ జనవరి31: తాండూరు పట్టణంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో పీఆర్‌టీయూ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన యాలాల, బషీరాబాద్ ఎంఈవో సుధాకర్ రెడ్డి ఉద్యోగ విరమణ సం దర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాల్గొని ఎంఈవోను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, రాష్ట్ర పీసీసీ ప్రచార కార్యదర్శి కరణం పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, యాలాల మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బషీరాబాద్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాములు, రవీందర్, రాష్ట్ర అసో సియేట్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పదవీ విరమణ పొందిన ఎంఈవో సుధాకర్‌రెడ్డిని శుక్రవారం పీఆర్‌టీయూ మండల శాఖ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, రవీంధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రవికాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధం అభినందనీయం



జిల్లా దిశా కమిటీ సభ్యులతో గట్టేపల్లి గ్రామస్తులు

ధారూరు, జనవరి 31: మద్యం మత్తును వీడి ఆదర్శంగా బతుకుదామని వికారాబాద్ జిల్లా దిశా కమిటీ సభ్యుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెండు సంవత్సరాలుగా మద్యపాన నిషేధం పాటిస్తున్నందున గ్రామాన్ని సందర్శించినట్లు తెలిపారు. మద్యపాన నిషేధ కార్యక్రమానికి ముందుకు వచ్చి స్వచ్ఛందంగా తీర్మానం చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు ఉన్నారు.

## ■ నియామకం



బషీరాబాద్, జనవరి 31: బషీరాబాద్ మండల బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలుగా గొట్టిగ కలాన్ గ్రామానికి కొత్తురు వీరమణి ఎన్నికయ్యారు. జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ శుక్రవారం ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య సూచన మేరకు ఆమెకు నియామక పత్రం అందజేశామన్నారు. వీరమణి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బషీరాబాద్ మండల అధ్యక్షురాలుగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్యకు, జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్‌కు, రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకూర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వీరమణికి జిల్లా మహిళా అధ్యక్షురాలు మధులత శ్రీనివాస్‌చారి, అనిత, నరసమ్మ, మంజుల రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకూర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేశ్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జి బసవరాజ్, యువ నాయకులు జుంటుపల్లి వెంకట్, సయ్యద్‌లాల్ ఉన్నారు.

## ■ సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మర్పల్లి, జనవరి 31: మండలంలోని దార్గులపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, సురేశ్, రఫీయుద్దీన్, సురేశ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

## ■ రైలు ఢీకొని మహిళ మృతి

యాలాల, జనవరి 31: రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత తాండూరు హనుమాన్ గల్లీకి చెందిన నర్సమ్మ (64) శుక్రవారం పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వచ్చింది. డబ్బులు తీసుకొని ఇంటి వెళ్లే క్రమంలో తాండూరు రైల్వే గేటు దాటుతుండగా ఓ గూడ్స్ రైలు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నర్సమ్మకు చెవుడుతో పాటు, కంటి చూపు మందగించిందని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# ప్రజాచైతన్యానికి ప్రతీక గద్దర్





గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి . పాటలు పాడుతున్న కళాకారులు

వికారాబాద్, జనవరి 31: గద్దర్ అనేది ఒక పేరు కాదు అది ఒక కెరటం, సమాజంలో జరుగుతున్న అన్యాయంపై పాట రూపంలో తిరగబడిన బల్లెం అని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ సాంస్కృతిక సారథి, భాషా సాంస్కృతిక శాఖ సారథ్యంలో నిర్వ హించిన గద్దర్ 77 వ జయంతి కార్యక్రమంలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పిం చారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గద్దర్‌తో రాజ కీయ నాయకులకు సిద్ధాంతాల మీద విభేదాలు ఉండవచ్చు, కానీ బడుగు, బలహీన వర్గాలకు న్యాయం కోసం గద్దర్ పోరాడిన బాట మాత్రం అందరికీ ఆదర్శమన్నారు.

తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా ఊరూరా తిరుగుతూ ప్రజలను చైతన్యవంతం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు గద్దర్‌ను స్మరిస్తూ పాడిన పాటలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకు న్నాయి. సినిమా కళాకారులకు గద్దర్ అవార్డులను ప్రధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. పాట ఉన్నంత వరకు గద్దర్ మనందరి మనసులలో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసు చంద్ర, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పాల్గొన్నారు.

# చదువుతో పాటు ఆటలూ ముఖ్యమే



ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బుయ్యని

తాండూరు రూరల్, జనవరి 31: యువతీయువకులు ఇండోర్ గేమ్స్ ఆడేందుకు ఇండోర్ స్టేడియం ఎంతగానో ఉపయోపడుతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు మండలం, అంతారం సమీపంలో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

**యాలాల:** మండల పరిధిలోని అగ్గనూరు, యాలాల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో విద్య, సంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ. 54 లక్షలతో నాలుగు అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే బుయ్యని శంకుస్థాపన చేశారు. అలాగే దేవనూరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మాజీ సర్పంచ్ కిషన్‌రావు జ్ఞాపకా ర్థం ఏర్పాటు చేసిన స్టేజ్‌ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, రాష్ట్ర పీసీసీ ప్రచార కార్యదర్శి కరణం పురుషోత్తమరావు, మాజీ జెడ్పీటీసి సిద్రాల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, అగ్గనూరు భీమప్ప, అమృతప్ప, అక్బర్‌బాబా, కలాల్ శ్రీనివాస్, హెచ్‌ఎం సుదాకర్ అధికారులు పాల్గొన్నారు.




# రహదారులపై మళ్లీ చెత్త డబ్బాలు!

### 477 జీవీపీ పాయింట్లలో 931 బిన్ల ఏర్పాటు

### నూతన టెక్నాలజీతో ఆమల్లోకి తెచ్చిన జీహెచ్‌ఎంసీ

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ ): గ్రేటర్ హైదరాబాద్‌లో చెత్త సమస్య జఠిలంగా మారింది. గార్బేజ్ ఫ్రీ సిటీనే లక్ష్యమని జీహెచ్‌ఎంసీ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు కనబడుతున్నాయి. ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారుల నుంచి గల్లీ రోడ్ల దాకా చెత్త పేరుకుపోతున్నది. తరచూ చెత్త వేసే ప్రాంతాలు (గార్బేజి వనరేబుల్ పాయింట్లు/జీవీపీ)లో చెత్త లేకుండా చేసేందుకు అధికారులు మళ్లీ తెరపైకి బిన్ల (చెత్త డబ్బాలు)ను అందుబాటులోకి తెచ్చారు. ఆరు జోన్ల పరిధిలో 477 జీవీపీ పాయింట్లను గుర్తించి 931 బిన్లు ఏర్పాటు చేస్తూ కమిషనర్ ఇలంబర్తి నిర్ణయం తీసుకున్నారు. ఒక్కొక్కటి 1100 లీటర్ల సామర్థ్యం గల బిన్లు జీవీపీ సెంటర్ల వద్ద ఏర్పాటు చేయనున్నారు. అడ్వాన్స్ ట్రాకింగ్ సిస్టమ్స్ ఆర్‌ఎఫ్ఐడీ విధానంలో పర్యవేక్షణ జరగనుంది. 70 శాతం బిన్లలో చెత్త పడగానే ఆర్‌ఎఫ్ఐడీ సెన్సార్ ద్వారా ఆ రూట్‌లో ఉన్న స్వచ్ఛ వాహనాన్ని (లిఫ్టింగ్ చేసే వాహనం) అలర్ట్ చేస్తుంది. దీంతో అటుగా వెళ్లే వాహనం ద్వారా ఈ బిన్లలోని చెత్తను క్లియర్ చేయనున్నారు. తద్వారా గతంలో మాదిరిగా జీవీపీ పాయింట్ల వద్ద కుక్కలు, పశువులు చిందర వందర చేసే అవకాశాలు ఉండవని అధికారులు తెలిపారు.

**బిన్ల వివరాలు ..**

| జోన్ | తరచూ చెత్త వేసే పాయింట్లు (జీవీపీలు) | బిన్ల ఏర్పాటు |
|---|---|---|
| ఎల్బీనగర్ | 46 | 106 |
| చార్మినార్ | 136 | 267 |
| ఖైరతాబాద్ | 76 | 166 |
| సికింద్రాబాద్ | 91 | 152 |
| శేరిలింగంపల్లి | 71 | 130 |
| కూకట్‌పల్లి | 57 | 110 |
| | 477 | 931 |

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హయత్‌నగర్, జనవరి 31 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, మేళ్లచెరువు, సాదుతండాకు చెందిన తేజావత్ రమేష్ (29) హయత్‌నగర్, శాంతినగర్‌లో నివాసముంటున్నాడు. స్నేహితుడి అల్లుడు హర్షవర్ధన్‌ను అల్వాల్‌లో జేఈఈ మెయిన్స్ ఎగ్జామ్స్ రాయించుకొని ఆర్టీసీ బస్సులో భాగ్యలత బస్‌స్టాప్ వద్ద సీఎంఆర్ ఎదురుగా దిగారు. వీరిద్దరూ కలిసి రోడ్డును క్రాసింగ్ చేస్తుండగా ఎల్బీనగర్ నుండి హయత్‌నగర్ వైపు అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకొచ్చిన పల్సర్ బైక్ నెం.(టీజీ05, 0199)పై పెద్ది శివప్రసాద్ వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రమేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. హర్షవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.


### ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

హయత్‌నగర్, జనవరి 31 : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా రావిపహాడ్‌కు చెందిన కుంచం మల్లయ్య(42), తన బైక్‌పై కుంట్లూరు నుండి హయత్‌నగర్‌కు బయలుదేరాడు. మార్గంమధ్యలో కుంట్లూరు చౌరస్తా వద్ద హయత్‌నగర్ నుండి కుంట్లూరు వైపు వెళ్తున్న హయత్‌నగర్ డిపో-2కు చెందిన బస్సు నెం. (ఏపీ29జెడ్3523)ను అతివేగం, అజాగ్రత్తగా దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. వెంటనే బైక్‌పై ఉన్న మల్లయ్య ఎగిరిపడడంతో ఆర్టీసీ బస్సు పైనుండి వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. .

### వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ మోసం

బంజారాహిల్స్, జనవరి 31: వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా డబ్బులు సంపాదించుకోవచ్చంటూ నమ్మించి బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. నవోదయ కాలనీలో నివసించే ఓ మహిళ ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటారు. వారం రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తినుంచి వాట్సప్ ద్వారా ఒక కాల్ వచ్చింది. ఇంట్లో ఉంటూనే టాస్క్‌లు చేయడం ద్వారా డబ్బులు సంపాదించుకోవచ్చని గుర్తుతెలియని వ్యక్తి నమ్మబలికాడు. టీవీ చానెళ్లకు రేటింగ్ ఇవ్వడానికి క్లిక్స్ చేస్తుండాలని సూచించారు. దీనికోసం కొంతమొత్తాన్ని తమకు చెల్లిస్తే టాస్క్‌లు పూర్తయిన వెంటనే అదనంగా డబ్బులు వేస్తామని నమ్మించారు. ఈ మేరకు ఒకటిరెండు సార్లు డబ్బులు పంపించారు. కాగా రెండ్రోజుల క్రితం ఓ టాస్క్ కోసం సదరు మహిళ రూ.89,999 పంపగా అవి తిరిగి రాలేదు. తన డబ్బులు రాలేదని ఆమె కోరగా రూ.1లక్ష వేస్తే డబ్బులు పంపిస్తామని సైబర్ నేరగాళ్లు బదులిచ్చారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ సమస్యలను పరిష్కరించండి



బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ సమస్యలపై కమిషనర్ హరికిరణ్‌కు వినతి అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 31. బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ సమస్యలను గత ఏడాదిగా ప్రభుత్వానికి విన్నవించుకున్నా నేటికీ పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రెంటల్ అగ్రిమెంట్ లీజ్ డీడ్ రెన్యువల్ పేరిట ముఖ్యంగా ఎక్సైజ్ అధికారులు వేధిస్తున్నారని వారు వాపోయారు. నాంపల్లిలోని అబ్కారీ భవన్ ఎక్సైజ్ శాఖ కమీషనర్ సి. హరికిరణ్‌ను శుక్రవారం సాయంత్రం కలిసిన అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ గౌడ్ మాట్లాడుతూ గతంలో లీజ్ డీడ్‌పై స్టాంపు డ్యూటీ వసూలు చేసి రెన్యువల్ చేసేవారని గుర్తు చేశారు. వెన్‌షాపులకు పర్మిట్ రూమ్‌ల విషయంలో ఉన్న నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా రెంటల్ అగ్రిమెంట్ రిజిస్టర్ సమస్యను పరిష్కరిస్తామని వైన్‌షాపుల పర్మిట్ నిబంధనలు అమలు చేస్తామని కెఎఫ్ బీర్ రేషన్ వారం రోజుల్లో తీసుకోవచ్చని కమిషనర్ హరికిరణ్ తెలిపినట్లు దామోదర్ వెల్లడించారు. టిఎస్‌బీసీఎల్ జీఎం అబ్రహాంను కలిసి తమ సమస్యలను విన్నవించుకోవడంతో పాటు సిరిసిల్ల జిల్లాలో జరిగిన బార్ సంఘటన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని హామీనిచ్చినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు ఐకమత్యంగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చని దామోదర్ గౌడ్ సూచించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులు ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, గౌరవ అధ్యక్షుడు విజయకుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు ఇ.రామకృష్ణ, సంయుక్తకార్యదర్శి మోహన్‌గౌడ్, ఆంజనేయులు గౌడ్, సిరిసిల్ల జిల్లా నాయకులు మారుతీ, కోదాడ నాయకులు పాల్గొన్నారు.



## గ్రామ దేవతకు ఘనంగా బోనాలు..

పెద్దేముల్, జనవరి 31: మండల పరిధిలోని తింసాన్‌పల్లిలో గ్రామ దేవతకు మహిళలు ఘనంగా బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్ల మధ్య పోతరాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఏర్పుల సాని సిగం భవిష్యవాణి వినిపించింది. పాడిపంటలు సమృద్ధిగా పండి గ్రామంలోని అందరూ సుభిక్షంగా ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చుతున్నాం : ఎమ్మెల్యే



కులకచర్ల, జనవరి 31 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతు రుణమాఫీతో పాటు ప్రతి రైతుకూ రైతు భరోసా కింద ఎకరానికి సంవత్సరానికి రూ. 12వేలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఉపాధిహామీ పథకంలో 20రోజులు పనిచేసి ఉంటే ఆ కుటుంబానికి రూ.12వేలు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తున్నదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో కులకచర్ల పీఏపీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, పార్టీ నాయకులు ఆనందం, గోపాల్‌నాయక్, శివరాంనాయక్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం



తాండూరు రూరల్, జనవరి 31: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తాండూరు మండలం, కరణ్‌కోట మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైల్వార్ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కరణ్‌కోట గ్రామంలో డాక్టర్ వికాస్ మెమోరియల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలతో శరీర దారుఢ్యం పెరగడంతోపాటు స్నేహభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శరణు బసప్ప, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మరికల్‌ను మండల కేంద్రంగా చేయాలి

కులకచర్ల, జనవరి 31 : చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ గ్రామాన్ని చుట్టు పక్కల గ్రామాలను కలుపుతూ నూతన మండలంగా ఏర్పాటు చేయాలని మరికల్ గ్రామానికి చెందిన యువజన నాయకుడు పిట్ల నర్సింహులు చౌడాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సూపరింటెండెంట్ రమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. మరికల్ గ్రామ పంచాయతీని 12 గ్రామ పంచాయతీలు, 7 రెవెన్యూ గ్రామాలతో కలిపి కొత్తగా మండలాన్ని ఏర్పాటు చేస్తే అన్ని విధాలా ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని, ఈ విషయాన్ని గతంలో ఉన్నతాధికారులకు, రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేయడం జరిగిందని అన్నారు. మరికల్ గ్రామాన్ని నూతనంగా ఏర్పాటు చేసేందుకు తగిన విధంగా సహకరించాలని కోరారు.

## కబడ్డీ క్రీడాకారుడు శివకుమార్ యాదవ్ కన్నుమూత

కాచిగూడ, జనవరి 31: ఆల్ ఇండియా కబడ్డీ క్రీడాకారుడు, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ చిట్టబోయిన శివకుమార్ యాదవ్(65)గురువారం రాత్రి గుండెపోటుతో ప్రైవేటు దవాఖానలో కన్నుముశారు. శివకుమార్ యాదవ్‌కు భార్య, ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన పార్థివ దేహాన్ని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ పార్లమెంట్ సభ్యుడు అంజన్‌కుమార్ యాదవ్, బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి, తలసాని సాయికిరణ్ యాదవ్, మాజీ ఎంపీ కాసాని జ్ఞానేశ్వర్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నందకిశోర్‌యాదవ్, నాగేందర్‌బాబ్జి, ఎల్.రమేశ్, అభిమానులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం హర్రస్‌పెంటలోని అంబర్‌పేట హిందూశ్మశాన వాటికలో శుక్రవారం శివకుమార్ యాదవ్ అంత్యక్రియలు నిర్వహించారు.

## విద్యుత్ శాఖ లైన్ మెన్‌పై దాడి

మల్కాజిగిరి, జనవరి 31: విద్యుత్ బకాయిలు చెల్లించాలని కోరిన లైన్‌మెన్‌పై ఓ ఇంటి యజమాని దాడి చేశాడు. మల్కాజిగిరి ఎస్సై కొండల్ కథనం ప్రకారం.. స్థానిక వసంతపురి కాలనీ సెక్షన్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న రిడియా నాయక్ సత్తిరెడ్డినగర్‌లో రెండు నెలలుగా విద్యుత్ బిల్లులు చెల్లించని సర్వీస్ నంబర్ 2810-31101కు గురువారం కరెంట్ కట్ చేశాడు. దీంతో ఇంటి యజమాని ఎం. సందీప్ రిడియా నాయక్‌తో వాగ్వాదానికి దిగాడు. నానా తిట్లు తిడుతూ చెంపపై కొట్టాడు. వెంటనే లైన్‌మెన్ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయగా ఘటనా స్థలానికి ఏఈతో పాటు ఇతర ఉన్నతాధికారులు వచ్చారు. వారిపైనా సందీప్ తిట్ల దండకం అందుకోగా వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

